

న్యూస్‌రీల్

వైభవంగా డోలా పౌర్ణమి ఉత్సవం



తొళక్క వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో మంగళవారం డోలాపౌర్ణమి ఉత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఉభయ దేవేరులతో శ్రీవారు తొళక్క వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ముందుగా ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అర్చకులు తొళక్క వాహనంపై ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చారు. ఆ తర్వాత శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా తిరువీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిట భక్తులు స్వామివారికి నీరాజనాలు సమర్పించి, భక్తిప్రపత్తులను చాటారు.

పీఈటీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు పదోన్నతి



డాక్టర్ సలీం బాషా

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయిన డాక్టర్ సలీం బాషా అల్లూరి సీతారామరాజు జిల్లాకు డీఈఓగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు నియామక ఆదేశాలను డీఈఓ సలీం బాషా అందుకున్నారు. వ్యాయామ విద్య నుంచి జిల్లా విద్యాశాఖాధికారిగా నియమితులు కావడం ఇదే ప్రథమం.

నేడు కలెక్టరేట్ వద్ద మహిళా దినోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): కొత్త జిల్లాలో తొలిసారిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరు కార్యాలయం గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటలకు ఘనంగా నిర్వహించనున్నామని కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. లింగ సమానత్వంపై కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మహిళలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న స్త్రీలను గౌరవించడం, సన్మానించడం చేస్తామన్నారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


తపాలా శాఖ ఆధ్వర్యంలో రచనా పోటీలు



తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని తపాలా శాఖ ఆధ్వర్యంలో 'నా తాతయ్య, నానమ్మ, అమ్మమ్మకు ఉత్తరం' అనే విషయంపై లేఖా రచన పోటీ నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ సీవీ రామిరెడ్డి తెలిపారు. పోటీకి వయోపరిమితి లేదని, చెప్పారు. పోటీలో నాలుగు కేటగిరీలు ఉంటాయని, 8 నుంచి 12 ఏళ్లు, 13 నుంచి 18, 19 నుంచి 40, 40 ఏళ్లు పైబడిన వారు పాల్గొనవచ్చని, ప్రతి కేటగిరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని వెల్లడించారు. ఏ4పై రాసిన ఉత్తరాన్ని స్పీడ్ పోస్టులో మాత్రమే పంపాలని తెలిపారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, తాడేపల్లిగూడెం డివిజన్, తాడేపల్లిగూడెం 534 101 చిరునామాకు ఈ నెల 31 కల్లా పంపాలన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి 5 వ తరగతి(ఇంగ్లీష్ మీడియం), ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల సమన్వయ అధికారి పీ.వాసవి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 24లోగా తమ దరఖాస్తులుసమర్పించాలని కోరారు. ఏలూరు జిల్లాలోని బాలుర గురుకులాలు (పెదవేగి, చింతలపూడి), బాలికల గురుకులాలు (పోలసానిపల్లి, వట్లూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, నూజివీడు), పశ్చిమగోదావరి జిల్లా నుంచి బాలురు (ఆరుగొలను, న్యూ ఆరుగొలను, ఎల్‌బీచర్ల), బాలికలు (పెనుగొండ), ఏలూరు జిల్లా నుంచి ఇంటర్ ప్రవేశం కోసం బాలురు (పెదవేగి), బాలికలు (పోలసానిపల్లి, వట్లూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, నూజివీడు), పశ్చిమగోదారి జిల్లా నుంచి బాలురు (ఆరుగొలను, ఎల్‌బీచర్ల)గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.



మహిళలూ.. మీకు జోహార్లు

అమ్మగా.. భార్యగా.. సోదరిగా.. కూతురిగా తన జీవితాన్ని కుటుంబ క్షేమం కోసం **త్యాగం** చేసే మహిళలు మీకు జోహార్లు.. అవకాశాలు కల్పిస్తే ఆకాశమే హద్దుగా **విజయం** సాధిస్తామని చాటిచెబుతున్నారు. సర్కారు చేయూతను అందిపుచ్చుకుని **కుటుంబా**నికి అండగా నిలుస్తున్నారు. నిబద్ధతతో కష్టాలను ఓర్చి సత్తా చాటుతున్నారు. **నేడు** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి **జిల్లాలో** ఆదర్శంగా నిలుస్తున్న మహిళామణుల కథనాలు, మనోభావాలు ఇవి..



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో మహిళలదే పై చేయి. గ్రామ స్థాయి సర్పంచ్ మొదలుకొని అన్ని పదవుల్లో మహిళల హవా కొనసాగుతోంది. హోం మంత్రి తానేటి వనిత, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఇలా చెప్పుకుంటూపోతే అధికార వ్యవస్థలో, రాజకీయాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారు.

జెడ్పీటీసీల్లో సగానికి పైగా మహిళలే

స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళల ప్రాధాన్యత గణనీయంగా పెరిగింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జరిగిన మొదటి ఎన్నికల్లో మహిళలకు

అన్ని రంగాల్లో హవా

50 శాతం స్థానాలకు పైగా కేటాయించారు. జిల్లాలోని 48 జెడ్పీటీసీ స్థానాలకు 25 జెడ్పీటీసీ స్థానాల్లో మహిళలే గెలుపొందారు. 858 ఎంపీటీసీ స్థానాలకు గాను 430 మంది ఎంపీటీసీలు మహిళలే. సర్పంచి పదవుల్లో అధిక శాతం మహిళలే. మున్సిపాల్టీల్లోను పూర్తిగా మహిళలదే హవా. ఏలూరు మేయర్‌గా షేక్ నూర్జహాన్, జంగారెడ్డిగూడెం చైర్‌పర్సన్‌గా బత్తిన లక్ష్మి, నర్సాపురం చైర్‌పర్సన్‌గా బర్రి వెంకటరమణ, ఆకివీడు చైర్‌పర్సన్‌గా జామి హైమావతి, కొవ్వూరు చైర్‌పర్సన్‌గా భావన రత్న కుమారి ఉన్నారు. అలాగే నామినేటెడ్ పదవుల్లో అగ్ర ప్రాధాన్యం దక్కింది.

సంక్షేమంతో మహిళలకు చేయూత

సంక్షేమ పథకాలైన నవరత్నాల్లో సింహ భాగం మహిళల ఖాతాల్లోకే చేరుతోంది. జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాలు, ఇళ్లు మహిళల పేరుతోనే ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేస్తుంది. వైఎస్సార్ ఆసరా ద్వారా ఏలూరు జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతలో రూ.326.92 కోట్లు, రెండో విడతలో రూ. 329.07 కోట్లు రుణమాఫీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో మొదటి విడతలో రూ.266.72 కోట్లు రెండో విడతలో రూ. 267 కోట్లు మాఫీ చేశారు. ఏలూరు జిల్లాలో బ్యాంక్ లింకేజీ స్కీం ద్వారా రూ.1150 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.980 కోట్లు స్వయం సహాయక సంఘాలకు ఇచ్చారు. ఏలూరు జిల్లాలో చేయూత పథకం ద్వారా ఈ ఏడాది రూ.223 కోట్లు, పశ్చిమలో రూ.182 కోట్లు మహిళలకు మంజూరు చేశారు. వైఎస్సార్ పెన్షన్ కానుకలో ఏలూరు జిల్లాలో రూ.34 కోట్లు, పశ్చిమలో రూ. 26 కోట్ల మేర మహిళలకు ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గతేడాది అమ్మ ఒడి ద్వారా 3.55 లక్షల మంది మహిళల ఖాతాల్లో రూ. 532.57 కోట్లు జమ చేశారు. స్త్రీ నిధి ద్వారా ఏలూరు జిల్లాలో రూ. 60 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ. 50 కోట్లు జమ చేశారు.



శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాగ చండీ సుజాత

ఆలయంలో పూజారిగా..

'ముదితల్ నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్' అన్న సూక్తికి ఉదాహరణ కొయ్యలగూడెం గ్రామానికి చెందిన చావలి నాగ చండీ సుజాత.. గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయంలో పౌరోహిత్యం చేస్తూ అమ్మవారి సేవలో ఆమె తరిస్తోంది. తండ్రి బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి ఆనంద శివాచార్య శిష్యరికంలో పురోహితురాలిగా సుజాత రాణించారు. భర్త శివకుమార్ తోడ్పాటుతో అమ్మవారి గర్భగుడిలో వేద పారాయణ, మంత్రసాధనల నడుమ తరిస్తున్నారు. డిగ్రీలో డీఈడీ పట్టా పొంది గవరవరం జెడ్పీ హైస్కూల్లో యోగా టీచర్‌గా కూడా ఆమె పనిచేస్తున్నారు. మిగిలిన సమయంలో గుడిలో పురోహితురాలిగా పనిచేస్తున్నారు. పూజారిణిగా ఉత్తీర్ణతకు దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం శైవాగమ శాస్త్ర, ప్రవేశ, వర పరీక్షలు పూర్తిచేసి గుర్తింపు పొందారు. వినాయక పూజతో ప్రారంభమై అమ్మవారికి అత్యంత ఇష్టమైన లలితా సహస్రనామ పారాయణ, కనకధార స్తోత్రం, కుంకుమ పూజ, నీరాజనం మంత్ర పుష్పాలతో పాటుగా అర్చకత్వానికి కావాల్సిన మంత్రాలను ముగ్ధ మనోహరంగా వల్లె వేస్తూ మహిళాలోకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

– కొయ్యలగూడెం

ఆటో సరస్వతి



ఆటో నడుపుతున్న దాసరి సరస్వతి

కుటుంబానికి ఆసరాగా నిలవాలనుకుంది. భర్త సంపాదనకు తన సంపాదన తోడైతే పిల్లల్ని మంచి చదువులు చదివించవచ్చనే ఆలోచనతో జంగారెడ్డిగూడెంకు చెందిన దాసరి సరస్వతి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తోంది. సరస్వతి డిగ్రీ చదువుతున్న సమయంలో కుటుంబ పరిస్థితులు దృష్ట్యా చదువు మానేసింది. ఈ క్రమంలోనే ఆమెకు వివాహమైంది. భర్త నాగరాజు ఆటో డ్రైవర్. భార్యకు ఆటో డ్రైవింగ్ నేర్పించాడు. ఆ తర్వాత నాగరాజు ఆటో అమ్మి వ్యాన్ కొన్నాడు. ఇంతలో సరస్వతికి డ్రైవింగ్ లైసెన్సు ఇప్పించడంతో పాటు ఫైనాన్స్‌లో సెకండ్ హ్యాండ్ ఆటోను కొనుగోలు చేశాడు. గతేడాది నుంచి ఆటో డ్రైవింగ్ మొదలు పెట్టింది సరస్వతి. ఉదయం వంట చేసి పిల్లలను స్కూల్‌లో దింపి, ఆటో వేసుకుని సెంటర్‌కు వస్తుంది. సాయంత్రం పిల్లలను స్కూల్ నుంచి తీసుకొచ్చేంత వరకు సర్వీసు నడుపుతుంది. పిల్లల్ని తీసుకొచ్చాక ఇంటి పనులు చేసుకుంటుంది. సర్వీసు బట్టి రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు మిగులుతుంది.

– జంగారెడ్డిగూడెం

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అవసరం



మాది శ్రీకాకుళం జిల్లా దర్గాసి. ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడ్డాను. నా తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహం కూడా ఉంది. 12 సంవత్సరాలు పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నాక భర్త ప్రోత్సాహంతో 2018లో గ్రూప్–1 రాసి సెలక్టయ్యాను. తొలిసారి పోలవరం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టాను. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టాక పోలవరం నిర్వాసితుల సమస్యలు, భూ సమస్యలు వంటి వాటిని అధికారుల సహకారంతో పరిష్కరించాను. గిరిజన ప్రాంతాల్లో మహిళలను చైతన్యపరిచి వారిని అనేక విధాలుగా ప్రోత్సహిస్తున్నాను. మహిళలు విద్యకు ప్రాధాన్యతనిచ్చి ముందుకు సాగితే అందరి ప్రోత్సాహం లభిస్తుంది.

– కె.లతాకుమారి, డీఎస్పీ, పోలవరం

ప్రజలకు సాయపడాలనే సంకల్పంతో..



చిన్నప్పటి నుంచి ప్రజలకు సాయపడాలని ఆశించేదాన్ని. ఆ సంకల్పంతోనే ముందుకు సాగాను. దీనికి భర్త, అత్తమామల సహకారం లభించింది. 2009లో గ్రూప్–2లో ఎంపికై తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించాను. ప్రజలకు అందుబాటులో ఉండి నా వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఆశయం దిశగా సాగుతున్నా. వరదల సమయంలో ఎంతో సవాలుగా తీసుకుని బాధ్యతలు నిర్వర్తించాను. కరోనా సమయంలో కూడా ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రయత్నించాను. మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు. సహకారం ఉంటే మరింత ముందుకు వెళ్లొచ్చు.

– బి.సుమతి, తహసీల్దార్, పోలవరం

మహిళల భద్రతకు పెద్దపీట



నేను 2014లో క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించాను. భర్త సహకారం, ఏలూరు ప్రజల మన్ననతో 2014లో నగర మేయర్‌గా ఎన్నికయ్యాను. అప్పటి నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్నాను. 2021లో రెండో సారి నగర మేయర్‌గా ఎన్నికయ్యాను. నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ తమ పురుషులతో పోటీపడుతున్నారు. స్త్రీ విద్యతోనే కుటుంబ, సమాజాభివృద్ధి సాధ్యం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేస్తూ అనేక అవకాశాలు కల్పిస్తున్నారు. మహిళల రక్షణకు దిశ చట్టానికి రూపకల్పన చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్లు, మహిళా పోలీసులు, దిశ యాప్, ఇలా అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు.

– షేక్ నూర్జహాన్, ఏలూరు మేయర్

కుటుంబానికి ఆర్థికంగా చేయూత



నా పేరు పల్లికొండ సునీత. గతంలో జీవనోపాధి కోసం తాపీ పనికి వెళ్లేదాన్ని. వైఎస్ జగన్ సీఎం అయ్యాక మాలాంటి వారికి అండగా నిలిచారు. ఉన్నతి పథకంలో రూ.50 వేల రుణం తీసుకుని కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాను. ఇప్పుడు కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాను. మాలాంటి పేద మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సీఎం సాయపడ్డారు.

– పల్లికొండ సునీత, జాగుడిగూడెం, కామవరపుకోట మండలం

స్వయం ఉపాధితో కుటుంబానికి చేదోడు



నా పేరు యాళ్ల క్రిష్ణవేణి.. గతంలో నా భర్తతో కలిసి కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేదాన్ని. జగన్ సీఎం అయ్యాక మహిళా మండలిలో సభ్యురాలుగా చేరి స్వయం ఉపాధి పొందుతున్నాను. ఆసరా పథకంలో రూ.40 వేల లోన్ తీసుకుని.. రాడ్ బెండింగ్ ఐరన్ కట్టర్ మిషన్ కొన్నాను. స్వయం ఉపాధి పొందుతు కుటుంబానికి అండగా నిలుస్తున్నాను.

– యాళ్ల కృష్ణవేణి, మైత్రి మహిళా మండలి గ్రూప్, కామవరపుకోట

ఆడపిల్ల భారం కాదు.. భరోసా



మా తల్లిదండ్రులకు మేం నలుగురు ఆడపిల్లలం. అందరికీ మంచి విద్య అందించారు. సమాజంలో మార్పు రావాలంటే ఆర్థిక అసమానతలు, లింగ వివక్ష పోవాలి. విద్యతోనే ఆ మార్పు సాధ్యం. నేడు ఆడపిల్ల భరోసా.. ఆడ, మగ ఇద్దరినీ సమానంగా చూస్తూ.. సమాన అవకాశాలు కల్పించాలి. లింగ వివక్షతను రూపుమాపేందుకు మనం సమష్టిగా కృషి చేయాలి. మహిళా దినోత్సవం జరుపుకోవడమే కాదు.. చైతన్యవంతులు కావాలి. – దయాల ఆశ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, ఏలూరు

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

- ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
- ఉభయగోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పి.మిథున్‌రెడ్డి



దెందులూరు నియోజకవర్గ ఓటర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పార్టీ కో–ఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ సుభాష్ చంద్రబోస్, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఘన విజయం అందించాలని, ఎన్నికలు ముగిసేంత వరకు పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని ఉభయగోదావరి జిల్లాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, ఎంపీ పి.మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం దెందులూరు మండలం నాగులదేవునిపాడు జేఎస్‌కే కన్వెన్షన్ హాలులో దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధ్యక్షతన దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్ల ఆత్మీయ సమావేశం జరిగింది. కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి క్షణం తెలుగుదేశం పార్టీ కుట్రలను ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు నిశితంగా గమనించాలన్నారు. కులం, మతం, ప్రాంతం, ప్రలోభం పేరిట లోబర్చుకునే ప్రయత్నాలు చంద్రబాబుకు, టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవా నిరతిని గుర్తెరిగి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలోని ఎమ్మెల్సీ ఓటర్లు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఘన విజయం అందించాలన్నారు. చంద్రబాబు, టీడీపీ కుట్రలు తిప్పికొట్టాలన్నారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ విజయం సాధించడం తథ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రజాప్రతినిధులు, ఓటర్లు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఓట్లు నమోదు చేసే ప్రక్రియలో పొరపాట్లు దొర్లకుండా చూసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఓటర్లు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గ పరిశీలకుడు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ పీ.విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఆళ్ళ నాని, కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో ఓటింగ్‌పై మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు పలు సూచనలు చేశారు.

రుణాల మంజూరు పెంచాలి

కలెక్టరు పి ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో స్వల్పకాలిక వ్యవసాయ రుణాల కింద ఇంతవరకు రూ.4,501 కోట్లు మంజూరు చేశారని, మరింత పెంచాలని కలెక్టరు పి.ప్రశాంతి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన డీసీసీ రివ్యూ కమిటీ మీటింగ్‌లో కలెక్టరు మాట్లాడుతూ ఈ సంవత్సరం రూ. 6,250 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా 72 శాతం మాత్రమే చేశారని అన్నారు. అగ్రికల్చర్ టర్మ్ లోన్ కింద రూ.1671 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా.. 0రూ.3671 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ఎడ్యుకేషన్ లోన్ కింద రూ.75 కోట్లకు కేవలం రూ.26.90 కోట్లు, గృహ నిర్మాణాలకు రూ.456.34 కోట్లకు రూ.219.66 కోట్లు, ఇతర రుణాల కింద రూ.263.57 కోట్లకు రూ.101.76 కోట్లు మంజూరు చేశారని కలెక్టరు తెలిపారు. జిల్లాలో కౌలు రైతులకు ఎక్కువ రుణాలు అందించాలని సూచించారు. టిడ్కో గృహాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. జగనన్న తోడు పథకంలో గ్రామీణ ప్రాంతాల వారికి 9557 రుణాలకు 10,908 మందికి మంజూరు చేశారని అన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం ఆర్‌కె అనుమ కుమారి, నాబార్డు డీడీఎం అనిల్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలి



జంగారెడ్డిగూడెం సదస్సులో పార్టీ కో–ఆర్డినేటర్‌లు పి.మిథున్‌రెడ్డి, సుభాష్ చంద్రబోస్, చిత్రంలో మంత్రి కారుమూరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యేలు ఎలీజా, బాలరాజు

జంగారెడ్డిగూడెం: చట్టంలో నిర్దేశించిన రిజర్వేషన్ కన్నా అదనంగా కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది అని, ఇది ఒక సాహసోపేత నిర్ణయమని వైఎస్సార్‌సీపీ ఉభయగోదావరి జిల్లాల కో–ఆర్డినేటర్‌లు పి.మిథున్ రెడ్డి, పిల్లి సుభాస్‌చంద్రబోస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆలపాటి కల్యాణమండపంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లోని మున్సిపల్ కౌన్సిలర్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అధ్యక్షత వహించారు. మిథున్‌రెడ్డి, బోస్‌లు మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటు కవురు శ్రీనివాస్‌కు, రెండో ప్రాధాన్యత ఓటు వంకా రవీంద్రనాథ్‌కు వేయాలని సూచించారు. పార్టీ ఆదేశాలను విధిగా పాటిస్తూ ప్రతీ ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. మంత్రి కారుమూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అందరికీ న్యాయం చేస్తున్నారన్నారు. విశాఖ సమ్మిట్‌తో ప్రపంచమంతా మన రాష్ట్రంవైపే చూస్తోందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఇద్దరు అభ్యర్థులను గెలిపించి జగన్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి మానవత్వం, మంచితనంతో పాలన చేస్తూ ప్రతీ ఒక్కరికి న్యాయం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలు ఎలీజా, తెల్లం బాలరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, బూత్ కమిటీల కో–ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, మహిళా అధ్యక్షురాలు సాయిబాల పద్మ, పట్టణ మండల కమిటీ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, వామిశెట్టి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బంగ్లాదేశ్ మహిళలకు కేవీకేలో నేటి నుంచి శిక్షణ

తాడేపల్లిగూడెం: బంగ్లాదేశ్ మహిళలకు, ఆ ప్రభుత్వ ప్రతినిధులకు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో బుధవారం నుంచి తొమ్మిదిరోజుల పాటు డ్రైఫ్లవర్ టెక్నాలజీపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఉపకులపతి టి.జానకీరామ్ మంగళవారం చెప్పారు. బంగ్లాదేశ్ ప్రభుత్వ సహకారంతో రానున్న ఈ బృందంలో బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రణాళిక ఉప కార్యదర్శి, వాణిజ్య విభాగపు అధికారి, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. వీరికి వాడిన పూలలో ప్రోసెసింగ్, మేలైన యాజమాన్య పద్ధతులు, కళాకృతుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. కడియం నర్సరీల సందర్శన, తిరుపతి ఉద్యాన పరిశోధనాస్థానంలోని నైపుణ్య శిక్షణ కేంద్రం సందర్శనలు ఉంటాయి. డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్.పద్మావతమ్మ, పరిశోధనా సంచాలకులు ఎల్.నారం నాయుడు, విస్తరణ సంచాలకులు ఈ.కరుణశ్రీలు అంతర్జాతీయ శిక్షణా సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు. బంగ్లాదేశ్‌లోని షేర్ ఏ బంగ్లా వ్యవసాయ విశ్వవిద్యాలయం, సొసైటీ ఫర్ బ్రైట్ సోషల్ సర్వీసెస్‌ను వీసీ జానకీరామ్ కార్యక్రమాలు ఆకర్షించడంతో బంగ్లాదేశ్ మహిళలు శిక్షణకు ఇక్కడకు వస్తున్నారని ఉద్యాన అధికారులు తెలిపారు.



విద్యతోనే మహిళా సాధికారత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సాధించడానికి ప్రతికూల పరిస్థితులను కూడా అధిగమించి విజయం సాధించిన చరిత్ర మహిళలకు ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని ఉద్యోగాల్లోనూ వారికి ప్రథమ ప్రాధాన్యత లభిస్తోంది. దశాబ్దాల క్రితం ప్రారంభమైన మహిళా ప్రాభవం ఇప్పటికీ కొనసాగుతోందంటే అది కేవలం వారు విద్యలో రాణించడం వల్లే. కొందరు మహిళలు చదువులో రాణిస్తూ ఉన్నత ఉద్యోగావకాశాలు అందుకుంటుండగా, మరి కొందరు తమ కన్న కలలను పిల్లలను ఆ దిశగా తీర్చిదిద్దుతూ ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తూ సాకారం చేసుకుంటూ సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కోవకు చెందిన కొందరి మహిళామణుల విజయగాథలు ఇవి..

పిల్లలతో పోటీగా చదివి.. జడ్జిగా ఎదిగి..

జి.బుల్లెమ్మ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి



వ్యవసాయదారుల కుటుంబంలో పుట్టిన జి.బుల్లెమ్మ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాలిటెక్నిక్ చదివారు. వివాహానంతరం న్యాయవాది అయిన భర్త పచ్చిగొళ్ల వెంకటరత్నం సహకారంతో భీమవరం డీఎన్నార్ కళాశాలలో లా చదివి పట్టా పొందారు. అప్పటి నుంచి ఏలూరు జిల్లా కోర్టులో భర్తతో పాటు న్యాయవాదిగా వృత్తి నిర్వహిస్తూ ఇంకా ఉన్నత స్థితికి చేరాలనే లక్ష్యంతో జడ్జి పోస్టుల పరీక్షలకు హాజరయ్యారు. ఒకసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లినా నిరుత్సాహమే మిగిలింది. దీంతో పట్టుదలతో తన ప్రయత్నాన్ని కొనసాగించారు. ఇంజనీరింగ్, లా చదివే కుమారులతో సమానంగా పోటీపడి చదివి తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ప్రస్తుతం ఆమె తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. పెద్దాపురంలో అనేక న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి ప్రజలకు, విద్యార్థులకు చట్టంపై చైతన్యం తీసుకువచ్చారు. నిష్పక్షపాతంగా తీర్పులు చెప్పి దేశ న్యాయవ్యవస్థకు గౌరవం తీసుకురావాలనేదే తన లక్ష్యం అంటారామె.

విజయం కోసం తపన పడేలా చేశా

ఆర్.నీరజా శ్రీలత, ఉపాధ్యాయురాలు



కుటుంబ, సామాజిక పరిస్థితులు ఎలా ఉన్నా విద్యపై దృష్టి కేంద్రీకరిస్తే ఎటువంటి విజయాలనైనా సొంతం చేసుకోవచ్చని పిల్లలకు బోధించడమే కాక తన కుమారుడిని ప్రోత్సహించి నిరూపించారు ఉపాధ్యాయురాలు ఆర్.నీరజా శ్రీలత. తాను ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండటంతో తన కుమారుడు శామ్యూల్ ప్రవీణ్ గౌతమ్‌ను విద్యాధికుడిగా తీర్చిదిద్దారు. సివిల్స్ తొలి ప్రయత్నం విఫలం కాగా, రెండోసారి కుమారుడికి వెన్నుదన్నుగా నిలవగా, అతని కఠోర సాధనతో విజయం సాధించాడు. ప్రయత్న లోపం లేకుండా పిల్లల్లో విజయం కోసం తపన పడేలా చేయడమే అతి పెద్ద విజయమని ఆమె చెబుతున్నారు.

లెక్చరరై.. పిల్లలనూ ఉన్నతంగా చదివిస్తూ..

తాతా వెంకట సాయి పద్మావతి, అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏలూరు



ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో 1998లో స్కూల్ అసిస్టెంట్‌గా వచ్చిన ఉద్యోగంతో సరిపెట్టుకోక గ్రూప్–2 పరీక్ష రాసి లెక్చరర్‌గా ఎదిగారు ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు తాతా వెంకటసాయి పద్మావతి. స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చినా చదువు పట్ల ఆమెకు జిజ్ఞాస తగ్గలేదు. ఇంకా చదవాలని, ఇంకా ఏదో సాధించాలని తపనతో సర్వీస్ కమిషన్ పరీక్షలు రాశారు. అందులో 2008లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. అంతేకాక గ్రూప్–2 పరీక్ష రాసి పీఓఆర్‌డీ ఉద్యోగానికి ఎంపికైనా ఆమెకు అత్యంత ఇష్టమైన బోధనా వృత్తిలోనే కొనసాగాలని నిర్ణయించుకుని ఆగ్రూప్–2 ఉద్యోగాన్ని ఒదులుకున్నారు. తన పిల్లలను కూడా తనలా ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చదివిస్తున్నారు. కుమారుడు జాతీయ స్థాయిలో ట్రిపుల్ ఐటీ కొట్టాయంలో సీటు సాధించడం, కుమార్తె మంచి మార్కులతో జూనియర్ ఇంటర్ చదువుతుండడం ఆమెకు సంతృప్తినిస్తోంది.

సివిల్స్ కల.. పిల్లలు సాధించారు

రాళ్లపల్లి జ్ఞాన అనసూయ, గుండుగొలను



సివిల్స్ సాధించడం కలగా మిగిలిన ఓ గృహిణి తన పిల్లలను ఆ దిశగా తీర్చిదిద్ది సాకారం చేసుకున్నారు. చదువులో చురుగ్గా ఉంటూ కాలేజ్ టాపర్‌గా ఉండేవారు గుండుగొలనుకు చెందిన రాళ్లపల్లి జ్ఞాన అనసూయ. ఉన్నత ఉద్యోగం చేయాలని లక్ష్యంగా చదివేవారు. అయితే వివాహం అనంతరం విద్యకు దూరం అయ్యారు. తన పిల్లలైనా ఉన్నత చదువులు చదవాలని పట్టుదలగా కృషి చేశారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులకు సమాజానికి అందించే సేవలపై పిల్లలకు చెబుతూ ఉండేదాన్ని. పిల్లలు కూడా అర్థం చేసుకున్నారు. అప్పటికే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న పెద్దబ్బాయి సివిల్స్‌కు వెళ్లగా, ఇంజనీరింగ్ పూర్తయి వెంటనే చిన్నబ్బాయి కూడా సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. ఇద్దరూ ఎంతో కష్టపడి ఎన్నో సంతోషాలను త్యాగం చేసి అమ్మ కలను నిజం చేశారు. పెద్ద కుమారుడు జగత్ సాయి ఐఏఎస్, చిన్న కుమారుడు వసంతకుమార్ ఐపీఎస్ అధికారులు అయ్యారు.

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎం కృషి భేష్



చింతలపూడి ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ, హెటిరో డ్రగ్స్ చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి, చిత్రంలో ఎంపీలు మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి, జెడ్పీ చైర్మన్ కవురు

- రాజ్యసభ సభ్యులు, హెటిరో డ్రగ్స్ చైర్మన్ బండి పార్థసారథిరెడ్డి
- చింతలపూడిలో ఆత్మీయ సమ్మేళనం

చింతలపూడి: ఆంధ్రప్రదేశ్‌లో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని రాజ్యసభ సభ్యులు, హెటిరో డ్రగ్స్ చైర్మన్ బండి పార్థసారథిరెడ్డి అన్నారు. స్థానిక ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో దేశ విదేశాల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలు రూ.వేల కోట్లు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దక్షతే కారణమన్నారు. ప్రస్తుతం ఫార్మారంగంలో ఏపీలో లక్ష మంది ఉపాధి పొందుతున్నారని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కారణంగా మరో లక్షమందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. తమ సంస్థ కూడా రూ.రెండువేల కోట్ల పెట్టుబడితో మరో ఫార్మా కంపెనీ స్థాపించడానికి గ్లోబెల్ సమ్మిట్‌లో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. తద్వారా మూడు వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో హెటిరో డ్రగ్స్ పేదల కోసం తక్కువ ధరలకే కరోనా నిర్మూలనా మందులు తయారు చేసి అందించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ పి.మిథున్‌రెడ్డి మాట్లాడుతూ హెటిరో డ్రగ్స్ ద్వారా ఏపీలో లక్షలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా మాట్లాడుతూ చింతలపూడిలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తే సహకారం అందిస్తామన్నారు. పార్థసారథిరెడ్డికి వెలగలపల్లిలో గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యులు ఉభయగోదావరి జిల్లాల ఇన్‌చార్జి పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాసరావు, వంక రవీంద్రనాథ్, జయమంగళ వెంకటరమణ, హెటిరో డ్రగ్స్ డైరెక్టర్ డా మోహన్‌రెడ్డి, మద్ది చైర్మన్ కీసరి సరితా విజయభాస్కర్‌రెడి పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ: సిద్ధాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ఆర్‌బీకే కార్యాలయం ధ్వంసంపై కేసు నమోదు

తణుకు: కొమరవరంలో రైతు భరోసా కేంద్రాన్ని ఆకతాయిలు ధ్వంసం చేశారు. సోమవారం అర్ధరాత్రి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసం చేసి తలుపులు, కిటికీలు పగలగొట్టారు. పెద్దింట్లమ్మ జాతరకు వచ్చిన యువకులు కొందరు ఈ ఘటనకు బాధ్యులంటున్నారు. అయితే కంప్యూటర్, ఇతర వస్తువులు వదిలివేయడంతో ఉద్దేశపూర్వకంగానే ఈ దాడి జరిగినట్లుగా భావిస్తున్నారు. వెటర్నరీ అసిస్టెంట్ ఎ.లక్ష్మణ్‌రావు, విలేజ్ వెల్ఫేర్ అసిస్టెంట్ కె.అరుణ్‌కుమార్ తణుకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రూరల్ ఎస్సై గుర్రయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షకు 1,784 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రయోగ పరీక్షల్లో సోమవారం 1,784 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో జరిగిన పరీక్షకు 27 కేంద్రాల్లో 1,252 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,229 మంది హాజరయ్యారు. అలాగే 16 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 653 మంది హాజరు కావాల్సి ఉండగా 555 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు తెలిపారు.

ప్రముఖ నిర్మాత మధుకు పితృవియోగం



మురళీరాజు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న అమీర్‌ఖాన్, మంతెన మురళీరాజు (అంతరచిత్రం)

హైదరాబాద్: ప్రముఖ సినీ నిర్మాత మంతెన మధువర్మరాజుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి మురళీరాజు (70) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. వెంగళరావునగర్‌కాలనీలోని ఆయన గృహంలో గత కొంతకాలంగా అస్వస్థతకు లోనై ఉన్నారు. భీమవరానికి చెందిన మురళీరాజు గతంలో పలు సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారు. అదేవిధంగా పలు వ్యాపారాలను చేశారు. మధువర్మరాజు గజినీ, రక్తచరిత్ర లాంటి తెలుగు, హిందీ, తమిళభాషల్లో 34 సినిమాలకు పైగా నిర్మించారు. ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌కు అత్యంత సన్నిహితులు కూడా. ప్రముఖ దర్శకులు రామ్ గోపాల్‌వర్మకు మేనమామ అయిన మధువర్మకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతదేహాన్ని అల్లు అరవింద్‌తో పాటుగా ఆయన కుమారులు, సినీహీరోలు అయిన అల్లు అర్జున్, శిరీష్, బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్, డైరెక్టర్ క్రిష్, గీతా ఆర్ట్స్ మేనేజర్ బన్నీవాసు, ఇతర నిర్మాతలు, దర్శకులు, ఇతర కుటుంబ సభ్యులు, వ్యాపారవేత్తలు తదితర ప్రముఖులు వెంగళరావునగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. పంజగుట్ట శ్మశాన వాటికలో ఆయనకు అంత్యక్రియలు నిర్వహించారు.

కన్నాయిగుట్టలో ఘోర అగ్ని ప్రమాదం

వేలేరుపాడు: కన్నాయిగుట్ట గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 27 గిరిజన కుటుంబాలకు చెందిన 24 పూరిళ్లు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు కోటి రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. మధ్యాహ్న సమయంలో గ్రామస్తులంతా పొలం పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇళ్లలో ఎవరూ లేని సమయంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో భారీగా నష్టపోయారు. తొలుత కారం నారాయణ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అనంతరం పక్కనే ఉన్న మరో 20 ఇళ్లకు మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఇళ్ల వద్ద ఎవరూ లేకపోవడంతో ఇళ్లలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. దీంతో బాధితులంతా కట్టుబట్టలతో మిగిలారు. ఈ ప్రమాదంలో పది ఇళ్లలో ఉన్న సుమారు 300 క్వింటాళ్ల పట్టే ధాన్యం గరిసెలు, సుమారు 250 క్వింటాళ్ల పెసలు, సుమారు 300 క్వింటాళ్ల శనగలు, 200 క్వింటాళ్ల మినుములు కాలిపోయాయి. కారం నారాయణ ఇంట్లో ఉన్న రెండు లక్షల నగదు, రెండు కాసుల బంగారం, ఇతర వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. మిరియాల వెంకయ్యకు చెందిన సైకిల్ షాపు కాలిపోవడంతో 15 సైకిళ్లు కాలిపోయాయి. మిరియాల వీరభద్రు, మిరియాల లక్ష్మణరావులకు చెందిన రెండు ద్విచక్రవాహనాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో కారం అర్జున్, మిరియాల



కన్నాయిగుట్టలో కాలిపోయిన గిరిజనుల ఇళ్లు



దగ్ధమైన ద్విచక్రవాహనాలు

రాములమ్మ, కారం లచ్చమ్మ, ఊకే పుల్లయ్య, పూరెం ముత్యమ్మ, ఊకే వీరమ్మ, మిరియాల నారాయణ, మిరియాల అర్జున్, సోయం చిన వెంకమ్మ, పెద వెంకమ్మ, మిరియాల వెంకయ్య, నూపా శారద, సోయం శ్రీను, మిరియాల ముత్యాలు, ముద్దునూరి మాలక్ష్మి, పూరెం చిన మంగరాజు, పూరెం పెద మంగరాజు, మిరియాల మల్లేష్, మిరియాల కామయ్య, సోడే గంగులు, పూరెం రాజమ్మలకు చెందిన ఇళ్లతో పాటు మరో రెండిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి.

కన్నీటి పర్యంతమైన గిరిజనులు

తమ కళ్ళ ముందే ఇళ్లు కాలిబూడిదవుతుంటే గ్రామ గిరిజనులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, అదుపు కాలేదు. కుక్కునూరు నుంచి వచ్చిన అగ్నిమాపక శకటం మంటలను అదుపు చేయడంతో మరికొన్ని ఇళ్లకు ప్రమాదం తప్పింది.

దాచుకున్న సొమ్ము కాలిపోయింది

గ్రామంలో మొత్తం 404 కుటుంబాలున్నాయి. గత ఏడాది జులైలో ఒక్కో కుటుంబానికి పోలవరం ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.6 లక్షల 86 వేల నగదును ప్రభుత్వం అందజేసింది. దీంతో ప్రతి ఇంట్లో రూ.20 నుంచి 30 వేల వరకు ఖర్చులకు నగదు దాచుకున్నారు. ఇలా సుమారు రూ.5 లక్షల వరకు నగదు ప్రమాదంలో కాలిపోయాయి.

సహాయక చర్యల్లో అధికారులు

జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీలక్ష్మి పర్యవేక్షణలో వేలేరుపాడు తహసీల్దార్ కె.చల్లన్నదొర బాధితులకు భోజన వసతి కల్పించారు. బాధితులకు 20 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు పంపిణీ చేశారు. ప్రభుత్వ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదు బుధవారం అందించనున్నారు.

అన్నింటా మేమే..



ఆటో నడుపుతూ..

మగవారితో సమానంగా ప్రతి పనిలోనూ తమ సత్తా చాటుతున్నారు మహిళలు. తల్లిగా కుటుంబ భారాన్ని మోస్తూ.. చెల్లిగా ఆప్యాయతను పంచుతూ.. భార్యగా జీవితంలో సగభాగమై భర్తకు సుఖసంతోషాల్లో తోడూనీడగా ఉంటూ.. అన్నీ తానై నడిపించేది స్త్రీయే. ప్రతిరోజూ దైనందిన జీవితంలో కుటుంబంలో భర్తకు తోడుగా కష్టపడుతూ కుటుంబ పోషణలో తోడుగా నిలుస్తోంది. ఆటో నడపటం, పెట్రోలు బంకుల్లో విధులు నిర్వహించడం ఇలా చిరుద్యోగం చేస్తూ చెమటను చిందిస్తూనే ఉంది. మగమహారాజులే కాదు... మేము సైతం అన్ని రంగాల్లో ముందుంటాం అంటున్నారు ఈ లేడీ లెజెండ్స్. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ మహిళలకు సాక్షి సలాం. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



కత్తి పట్టి కొబ్బరి బొండాలు కొడుతూ..



ఇనుమును వంచుతూ..



పెట్రోలు కొడుతూ..

క్లుప్తంగా

ఘనంగా సామూహిక సహస్ర కుంకుమార్చనలు


ప్రత్యేక అలంకరణలో చింతామణి అమ్మవారి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాల్గుణ పౌర్ణమి (శ్రీ లక్ష్మీ జయంతి) పురస్కరించుకొని మంగళవారం స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో ఉదయం నిత్యార్చనలు, అనంతరం చింతామణి దేవి అమ్మవారికి సామూహిక సహస్ర కుంకుమార్చనలు ఆలయ అర్చకులు మంగిపూడి సీతారామయ్య బ్రహ్మత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవీ కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో పాల్గుణ మాసం పౌర్ణమి మంగళవారం సందర్భంగా ఉదయం విఘ్నేశ్వరపూజ, అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలు ఫలారసాలతో పసుపు, కుంకుమ, గంధములతో విశేష అభిషేకాలు ఆలయ ప్రధాన పురోహితులు నారాయణ శర్మ బ్రహ్మత్వంలో జరిగాయి. అమ్మవారికి విశేష అలంకరణ గావించారు. ఈ కార్యక్రమాలను ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న బాల త్రిపుర సుందరరావు, ఆలయ సెక్రటరీ ఆలపాటి చిన్న, పూర్వ అధ్యక్షులు పేరూరి కాశయ్యలు పర్యవేక్షించారు.

సమాజంలో స్త్రీకి ప్రత్యేక స్థానం

పెంటపాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద మంగళవారం మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గంటా మంగతాయారు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు చిర్ల పుల్లారెడ్డి, శిరపరపు రంగారావులు సమాజంలో స్త్రీకి ప్రత్యేక స్థానం ఉందని స్త్రీలంతా క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి. ఉమాదేవి, పి. శిరీష, మంగతాయారు, నీరజ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరుని కల్యాణం

పెంటపాడు: మండలంలోని ఉరచెరువు గట్టున వేంచేసియున్న బాలవెంకటేశ్వరుని కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీ భాష్యం రామశేషభట్టార్ బ్రహ్మత్వంలో జరిగిన ఈ తంతులో ఉదయం నిత్యహోమం, స్వామివారికి ప్రత్యేక పూజలు చేసాంు. ఆలయ ధర్మకర్త సుధాకర్ దంపతులు స్వామివారి కల్యాణం జరిపించారు. కొడవటిగంటి జగన్నాధాచార్యులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేసారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాన్ని పంపిణీ చేసారు.

కోనాలలో పొలంబడి

టౌన్: దాళ్వా అనంతరం పంట పొలాలల్లో రైతులు పచ్చి రొట్ట పైరులు వేసు కోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఎంవీ రమేష్ చెప్పారు. మంగళవారం తణుకు రూరల్ మండలం కోనాల గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దాళ్వా వరి సాగులో ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఏవో కె కుసుమ మాట్లాడుతూ మండలంలో 11,392 ఎకరాలలో వరిసాగు చేస్తున్నారని, వాటిలో ఎంటీయూ 1121 రకం వరిని ఎక్కువగా సాగు చేస్తున్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో ఏఈవో టీ వీరభద్రుడు, వీఏవో చందు, సర్పంచ్ ఎం చిన్నయ్య, ఎంపీటీసీ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సుమలతకు సత్కారం

ఇరగవరం: మండలంలోని రేలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న వి.సుమలతకు మంగళవారం రేలంగి శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో గత నెల 20 నుంచి 23 వరకు జరిగిన అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మహిళ ఫిజికల్ డైరెక్టర్లు సత్తా చాటారు. అందులో ఒక సభ్యురాలుగా ఉన్న సుమలతకు సన్మానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని సన్మాన కమిటి ప్రతినిధులు తెలిపారు.

స్టేట్ విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేయాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజా ప్రయోజన అవసరార్థం రాష్ట్రంలో స్టేట్ విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు వినియోగదారులు ఫోరం రాష్ట్ర వైస్ చైర్మన్ ఏఆర్‌కే హనుమంతరావు మంగళవారం తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయి శాఖ ద్వారా పేదలకు అందచేస్తున్న బియ్యాన్ని కొందరు మిల్లర్లు రూ.10 నుంచి రూ.13లకు కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేస్తున్నారన్నారు. వీటికి పాలిష్ పట్టి సుమారు కిలో రూ.50కి విక్రయిస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న కొందరు అవినీతిపరులకు బియ్యం తరలిస్తున్నారని చెప్పారు. ఈ విధంగా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న అక్రమార్కులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళా.. నీ సహనానికి సరిహద్దులు కలవా..

కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలు




మహిళాదినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు తదితరులు


అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశిష్ట మహిళలను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

పెంటపాడు: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి, విజయంసాధించాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం కళాశాల ఆడిటోరియంలో ఆయన అధ్యక్షతన కళాశాల మహిళా అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరానికి సంబంధించి లింగ సమానత్వం అనే అంశాన్ని తీసుకొని మహిళలను ఎంతో గౌరవిస్తోందన్నారు. ఇప్పటికే మహిళలు అన్నిరంగాల్లోనూ అవకాశాలు అందిపుచ్చుకొని విజయాలు సాధిస్తున్నారన్నారు. మహిళలు మరింత అభివృద్ధి సాధించాలని కోరుకొంటూ వారిని ఘనంగా సన్మానించారు. మహిళాసాధికారిక విభాగాధిపతులు డాక్టర్ జేవీ జయంతికుమారి, రమా మాధురి, మల్లికతో పాటు, ఎన్‌సీసీ అధికారి ఎంవీ ప్రేమ్‌సాగర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విజయబాబు, గణిత అధ్యాపకులు అర్కే ఫణిధర్, తదితర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

పెంటపాడు: మహిళలు చట్టాలపై సరైన అవగాహన పెంచుకోవాలని తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ అథారిటీ ఛైర్మన్ డి.ప్రకాష్‌బాబు కోరారు. మంగళవారం పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ శేషగిరిరావు, సచివాల సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళా విద్య ద్వారానే కుటుంబ, సమాజం అభివృద్ధి

తణుకు టౌన్: మహిళా విద్య ద్వారానే కుటుంబం, సమాజం అభివృద్ధి సాధిస్తాయని రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంకు మనోరమ చెప్పారు. మంగళవారం తణుకు రోటరీ క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు బసవ రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి సంబంధించిన వివిధ అంశాలను వివరించారు. ఈ సందర్భంగా మనోరమను, తణుకు రాయసం రాజ్యలక్ష్మీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ భమిడి కమలాదేవిలను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రోటరీ కార్యదర్శి జీ సుధాకర్, మల్లిన రామచంద్రరావు, పుట్టా రామచంద్రరావు, జేఎస్ సుబ్రహ్మణ్యం, మేడికొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


సైకిళ్లు పంపిణీ చేస్తున్న డైమండ్స్ క్లబ్ సభ్యులు

తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో....

తణుకులోని ఎస్కేఎస్‌డీ(?) ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో న్యాయవాది కరణ్మయి, లయన్స్ క్లబ్ సభ్యురాలు ఎం నాగజ్యోతిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జీ చంద్రశేఖర్, అధ్యాపకులు డీ కనకమహాలక్ష్మి, ఎం రజని, ఏ మారుతీదేవి చౌదరి, పీసీహెచ్ దేవి, జీ ఇందిరా కుమారి, బీఎల్ఎస్ పద్మశ్రీ, జీ కమల, బీ శిరీషా, పీ సునీత పాల్గొన్నారు.

మారుతీ కళాశాలలో ...

తణుకులోని శ్రీ మారుతీ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడకలు, హోలీ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో లయన్స్ జిల్లా సేవా కార్యక్రమాల కోఆర్డినేటర్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు వావిలాల సరళాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు, అధ్యాపకులు నాగేశ్వరరావు, జయ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డైమండ్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు స్ఫూర్తిదాయకమని అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ గుండుబోగుల వెంకట రమణ పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం డైమండ్స్ ఆధ్వర్యంలో బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు సైకిల్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. వెంకట రమణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, భావితరాలకు మన సంస్కృతి సంప్రదాయాలను అందించే బాధ్యత మహిళలదే అన్నారు. డీవైఈఓ రవీంద్ర భారతి, పీడీ ఇంద్రవాణి, అంజనాదేవి, సునీత, సాయిలక్ష్మి, రత్నకుమారి, వెంకటలక్ష్మి, వెంకట రమణ, క్లబ్ నిర్వాహకురాలు కోనా కళ్యాణి, లయన్స్ క్లబ్ జిల్లా ఉప గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, డైమండ్స్ అడ్మిన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, కోనా హనుమాన్, రెడ్డి రాజు, నందిని, విద్యార్థులు పాల్గొన్నారు.

దశల వారీగా ఇంటి బిల్లులు మంజూరు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వేణుగోపాల్

తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇంటి నిర్మాణాలకు జియోట్యాగింగ్ ప్రకారం దశల వారీగా బిల్లులు వెనువెంటనే చేయాలని ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వి.ఎస్.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో క్లస్టర్ ప్రత్యేకాధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వేణుగోపాల్ మాట్లాడుతూ మండలంలోని 27 గ్రామాలకు 27 క్లస్టర్ ఇన్‌ఛార్జీలను నియమించడం జరిగిందన్నారు. మొత్తం 3079 ఇళ్లు మంజూరు కాగా, 1511 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మరో 1568 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వాటన్నింటికి దశల వారీగా బిల్లులు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇంకా ఇంటి నిర్మాణాలు ప్రారంభించని వారుంటే వెంటనే లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించి క్లస్టర్ల వారీగా లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. లబ్ధిదారులకు ఏమైనా ఇబ్బందులుంటే తెలుసుకోవాలన్నారు. అవసరమైతే ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, ఏఈ వైవి.వెంకట్రావు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ఆర్ఎస్.ప్రసాద్, ప్రియదర్శిని, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, పీఆర్ ఏఈ ప్రవీణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, సీసీ రేఖారమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి


వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న పెంటపాడు, రూరల్ ఎస్సైలు

పెంటపాడు: ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వాడకం తప్పని సరి అని గూడెం రూరల్, పెంటపాడు ఎస్సైలు వీరభద్రదరావు, సత్యనారాయణలు పేర్కొన్నారు. హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీలుగా ప్రత్తిపాడు హైవే రోడ్డు కూడలి అయిన సాక్షి కార్యాలయం వద్ద వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌తో చెరువులు అభివృద్ధి చేసుకోవాలి


సమీక్షా సమావేశంలో మ్టాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ పీ శ్రీనివాసరావు


తణుకు టౌన్: గ్రామాల్లోని మంచినీటి చెరువులను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసుకునేందుకు అమృత్ సరోవర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణ మంచినీటి సరఫరా డీఈఈ పీ శ్రీనివాసరావు కోరారు. మంగళవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో తణుకు నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, గ్రామ కార్యదర్శులు, జాతీయ ఉపాధి హామీ పథకం సాంకేతిక సిబ్బంది, ఇంజనీరింగ్ కన్సల్టెన్సీలకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్ సరోవర్ పథకంలో మంచి నీటి చెరువులను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసుకునేందుకు మంచి అవకాశమన్నారు. తణుకు నియోజకవర్గంలో సుమారు 30 చెరువులను అభివృద్ధి చేయడానికి గుర్తించినట్లు తెలిపారు. వాటిని అభివృద్ధి చేసేందుకు అవసరమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని కోరారు. ఎక్కడైనా మిగులు మట్టి వుంటే పంచాయతీ తీర్మాణం మేరకు ప్రభుత్వ స్థలాలను మెరక చేయాలని కోరారు. పూరైన చెరువు గట్లను చక్కని వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ పనులలో ఎక్కడైనా లోపాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీడీ బీ వీరాస్వామి, తణుకు, ఇరగవరం, అత్తిలి, ఎంపీడీవోలు, ఈవో పీఆర్డీలు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, మూడు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు సత్యదేవుని కల్యాణం

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణ పురదేవత బలుసులమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో ఈనెల 8వతేదీన శ్రీ సత్యదేవుని (శ్రీ రమా సత్యనారాయణ స్వామి) వారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయ కమిటి ఛైర్మన్ కొట్టు రామాంజనేయులు (అంజిబాబు) తెలిపారు. బలుసులమ్మ ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం శ్రీ రమా సత్యనారాయణ స్వామి వారి శాంతి కల్యాణం చేయిస్తున్నామన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, తనయుడు కొట్టు విశాల్, ఆలయ కమిటి ఛైర్మన్ కొట్టు రామాంజనేయులు దంపతులు స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పూజలు నిర్వహిస్తారన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు కల్యాణోత్సవాన్ని దర్శించి స్వామి వారి ఆశీస్సులు పొందాలన్నారు.

రూ. 1.20 కోట్లతో ఆలయ అభివృద్ధి: బలుసులమ్మ అమ్మవారి ఆలయాన్ని పునరాభివృద్ధి చేయడంతోపాటు మరో రూ. 1.20 కోట్లతో ఆలయ ప్రాంగణంలో మరిన్ని అభివృద్ధి పనులు చేయిస్తున్నట్లు కొట్టు అంజి తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రతి శుక్రవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ప్రత్యేకంగా రెండస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెలనాటి సత్తిబాబు, వట్టిపోలు రాము, రాజా త్రినాథ్, పెదప్రోలు వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ సక్సెస్‌పై హర్షం


మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ సక్సెస్ కావడం పట్ల మాల మహానాడు తరపున హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో జరిగిన సమావేశంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ ఒక విజన్ ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. దేశ విదేశాల్లోని పారిశ్రామిక దిగ్గజాలు మన రాష్ట్రానికి వచ్చి సుమారు 13 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధం అవ్వడం ఎంతో గర్వకారణమన్నారు. లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి రానున్నట్లు తెలిపారు. ఏపీని అభివృద్ధి పథంలోకి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొని వెళ్తుంటే ఇటువంటి గొప్ప విషయాన్ని గుర్తించలేని ప్రతి పక్షాలు విష ప్రచారం చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. మంచి చేసినప్పుడు అభినందించాలన్నారు. విమర్శించడం మాని సూచనలు,సలహాలు ఇవ్వాలని ప్రతిపక్షాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు మానుకొండ నాగేశ్వరరావు, జిల్లా యూత్ అధ్యక్షుడు బి.సందీప్, చిట్టిరాజు, బి.సనీల్‌బాబు, ఎం.కిరణ్ తదితరులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం (డెమొక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ) పశ్చిమ గోదావరి జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఆర్.నూతన కుమార్ రెడ్డి ఆదేశాలు మేరకు సంఘ రాష్ట్ర వ్యవస్థాపకుడు పి.సామ్యూల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.జోసెఫ్ కిషోర్‌లు జిల్లా కమిటీ ఎంపికను పర్యవేక్షించారు. పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ అధ్యక్షుడిగా వి.జోగేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా టి.దుర్గా ప్రసాద్, సహాయ కార్యదర్శిలుగా జి.లక్ష్మీప్రియ, బి.సుగుణాకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్.రజిని, ఎన్.శ్యాం సుందర్, ఈసీ సభ్యులుగా జి.మంగరాజు, ఎ.వరప్రసాద్, బి.దుర్గా ప్రసాద్, వి.మహేష్, ఆర్.వెంకటేశ్వర్లు, బి.నాగబాబు, ఐ.బిన్నీ, ఎన్.వరలక్ష్మి, సీహెచ్ చౌదరి, కే.రూపేష్, పి.శ్రీను, జి.కెల్విన్, ఎస్.క్రాంతి, టి.ఆనంద్, రవి కుమార్, ఆర్.రవీంద్ర, జీఎస్ఎన్ బాబు, ఎస్కే సమీర్, కె.కృష్ణ వాసులను నియమించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

శ్మశానవాటిక కోసం శవంతో ధర్నా


పెంటపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద శ్మశానం కోసం ధర్నా చేస్తున్న రెల్లి కులస్తులు

పెంటపాడు: మండలంలోని రెల్లి కులస్తులకు శ్మశాన వాటిక కేటాయించాలని కోరుతూ మంగళవారం పెంటపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద శవంతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళితహక్కుల పోరాటసమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ మండల కేంద్రమైన పెంటపాడులో అన్ని కులాలకు ఉన్నరీతిగానే రెల్లి కులస్తులకు శ్మశానభూమి కేటాయించాలని ఎంతో కాలం నుంచి రెల్లికులస్తులు కోరుతున్నారన్నారు. గ్రామంలో శ్మశానవాటిక కేటా యించకుండా ఆ ప్రాంతాన్ని డంపింగ్‌యార్డుగా వినియోగిస్తున్నారన్నారు. తక్షణం శ్మశాన వాటిక కేటాయించాలని మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన బౌరిశెట్టి చిట్టెమ్మ మృతదేహంతో స్థానిక రెల్లి కులస్తులు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ శేషగిరిరావుకు వినతిప్రతం అందజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్ల యూనియన్ కోశాధికారి తాడికొండ వాసు, ధనాల శంకర్, భౌరిశెట్టి శ్రీను, తాడికొండ శ్రీను, తాడికొండ జయరాం, రౌతు భసవరాజు, కె. సుబ్బారావు, దానమ్మ, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రంథాలయాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో చదువరులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని గ్రేడ్ -1 గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు వెల్లడించారు. గ్రంథాలయానికి అవసరమైన రూ 10 వేలు విలువైన కాంపిటీషన్ పుస్తకాలను దాతలు సహాయ సహకారాలతో మంగళవారం శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన డోనర్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ జి.సుబ్బారెడ్డి, విశ్రాంత ఎంఈఓ ఎస్.సాల్మన్‌రాజుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. చదువరులకు దోమల బెడద లేకుండా ఉండే విధంగా కిటికీలకు రూ 10 వేలతో జోర్ మెస్‌లు ఏర్పాటుచేశారు. వక్తలు మాట్లాడుతూ దాతలను గ్రంథాలయాధికారి అభినందించారు. చదువరులు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పి.భాస్కరరావు, ఏవీ లక్ష్మణరావు, మహాశివభట్ల లక్ష్మణరాజు, డి.అమ్మనరాజు తదితరులు పర్యవేక్షించారు.

యోగాతో మానసిక ఉల్లాసం సాధ్యం

పెంటపాడు: యోగా ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ అలవడుతుందని ప్రముఖ యోగా, ధ్యాన శిక్షకురాలు జి. రూప పేర్కొన్నారు. గూడెం కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా యోగా సాధన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారిన ఆహారపు అలవాట్ల వల్ల శరీరంపై ఒత్తిడి పెరిగి, కొలస్ట్రాల్ అధికమవుతోందన్నారు. దీనివల్ల చిన్నవయస్సులోనే గుండె, కాలేయ, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అయితే వీటిని అదుపు చేసుకొనేందుకు ఉచితంగా ప్రతి నిత్యం ఉదయం కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్లో జరిగేశిక్షణకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిసర గ్రామాల ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్: బాలబాలికలు ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, చదువు వారి నైతిక హక్కు అని బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జె.రాజేంద్ర మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి, నాడు-నేడు, విద్యాదీవెన, వసతి దీవెన వంటి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. విద్యార్థులు ఈ పథకాలను వినియోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ, ఐసీడీఎస్ అధికారిణి ఎస్తేరు రాణి, ఆరుగొలను గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ భూమా శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.